సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం ∙ 11 ∙ జనవరి ∙ 2023



గుడారాల తొలగింపులో ఉద్రిక్తత

బూర్గంపాడు మండలం మణుగూరు క్రాస్‌రోడ్ సమీపంలో వరద బాధితుల దీక్షా శిబిరం వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. 8లో



రోడ్డును కమ్మేసిన బూడిద

పాల్వంచ – పాండురంగాపురం రహదారిపై మంగళవారం కేటీపీఎస్ బూడిద కమ్మేయడంతో కాసేపు రాకపోకలు స్తంభించాయి. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 16°

వాతావరణం

జిల్లాలో బుధవారం రాత్రి కొంత చలి ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం మాత్రం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం స్వామివారి నిత్యకల్యాణ వేడుక కనులపండువగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. మంగళవారాన్ని పురస్కరించుకొని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పురుషోత్తపట్నంలో రాపత్తు సేవ

శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి మంగళవారం ఏపీలోని పురుషోత్తపట్నంలో రాపత్తు సేవ నిర్వహించారు. రామాలయం నుంచి పల్లకీలో స్వామివారిని మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా పురుషోత్తపట్నం తీసుకెళ్లారు. తమ గ్రామానికి వచ్చిన రామయ్యకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికి పూలు, పండ్లు సమర్పించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట్రామిరెడ్డి, గ్రామస్తులు కుందురు రామిరెడ్డి, అర్తిమల్ల రామచంద్రరావు, ఆకుల శ్రీనివాసరావు, బోగాల వీరారెడ్డి, పుట్టి వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, రాధ తదితరులు పాల్గొన్నారు.

అద్దె వాహనాలకు టెండర్లు

చుంచుపల్లి: జిల్లా పరిధిలో కంటివెలుగు–2 కార్యక్రమం కోసం 48 బృందాలు వివిధ ప్రాంతాల్లో పర్యటించేందుకు 50 సెవెన్ సీటర్ అద్దె వాహనాలకు షార్ట్ టెండర్లు కోరుతున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వాహనాల యజమానులు బుధవారం మధ్యాహ్నం 12 గంటల లోపు తమ కార్యాలయంలో వాహనాలకు సంబంధించిన పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

14 నుంచి ఐదు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు

ఇల్లెందురూరల్: సంక్రాంతి సందర్భంగా ఇల్లెందు మండలం కొల్లాపురంలో ఈనెల 14, 15 తేదీల్లో ఐదు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు యంగ్‌స్టార్ యూత్ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాల స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.16 వేలు, తృతీయ జట్టుకు రూ.12 వేలు, కన్సోలేషన్ బహుమతిగా రూ.8వేలతో పాటు జ్ఞాపిక అందిస్తామని వివరించారు. ఆసక్తి గల జట్లు ఈనెల 13లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. 14వ తేదీ ఉదయం 8 గంటల లోపు క్రీడా ప్రాంగణానికి హాజరైన జట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. వివరాలకు 7702347573 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నా వాళ్లంతా బరిలో..



తోగ్గూడెంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పాయం వెంకటేశ్వర్లు తదితరులను సన్మానిస్తున్న అనుచరులు

కష్టకాలంలో ప్రజల వెంటే నడుస్తా

- నాకు పదవులు ముఖ్యం కాదు..
- పార్టీలో నా వాళ్లకు గౌరవం, మర్యాద దక్కడం లేదు
- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి సంచలన వ్యాఖ్యలు

మణుగూరుటౌన్: ప్రజా సేవలో తన వెన్నంటి నడిచిన వారంతా వచ్చే ఎన్నికల్లో బరిలో ఉంటారని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎన్ని అవమానాలు, ఇబ్బందులు ఎదురైనా మీతోనే ఉంటానని, అండగా నిలుస్తానని అనుచరులు, అభిమానులకు భరోసా ఇచ్చారు. మణుగూరు మండలం తోగ్గూడెం సమ్మక్క సారలమ్మ అలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. పదవుల పంపకాల్లో తనకు, తన అనుచరులకు ఎదురైన అనుభవాలను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదంటూ అధికార పార్టీపై పరోక్ష విమర్శలు చేశారు. తనకు, తనతో ఉన్నవారికి పదవులు ఇవ్వకున్నా.. కనీసం తాము ఉన్నామనే భరోసా కూడా బీఆర్‌ఎస్ నుంచి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా కష్టంలో ఉంటే ఆదుకోవడం, ఓదార్చడం తనకు తెలుసని, అయితే అలా చేయడం వారికి నచ్చడం లేదని అన్నారు.

పినపాకకు ఎందుకు వస్తున్నానంటే..

పినపాకకు ఎందుకు వస్తున్నావని కొందరు వ్యక్తులు తనను ప్రశ్నిస్తున్నారని, తొలిసారి రాజకీయాల్లోకి వచ్చినప్పుడు నా పార్లమెంటు పరిధిలో లేకపోయినా పినపాకలో పర్యటించానని, అప్పటి నుంచి పార్టీ, పదవులతో సంబంధం లేకుండా ఇక్కడి ప్రజలతో మమేకం అయ్యానని పొంగులేటి తెలిపారు. సంక్రాంతికి వచ్చిపోయే గంగిరెద్దును కాదని, నిత్యం ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో తోడుగా నిలిచానని చెప్పారు. మీ ఇంటెలిజెన్స్‌ను అడిగి సమాచారం తెప్పించుకోండంటూ అధికార పార్టీ నేతలకు సూచించారు.

పినపాకలో అరాచక పాలన : పాయం

పినపాక నియోజవర్గంలో అరాచక పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి తన హయాంలోనే రూ.400 కోట్ల నిధులు తీసుకొచ్చానని చెప్పారు. ఆ పనులకే ఇప్పుడు కొబ్బరికాయలు కొడుతూ సోషల్ మీడియాలో డబ్బా కొట్టుకుంటున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ఒక సైకో ఎమ్మెల్యే పాలన కొనసాగుతోందని అన్నారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి ఏంటో, ప్రస్తుత ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏంటో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అధికారం అడ్డం పెట్టుకొని నియోజకవర్గంలో భూదందాలు, ఇసుక మాఫియా, భూ ఆక్రమణలు చేస్తూ ప్రజలను భయభ్రాంత్రులకు గురిచేస్తున్నారని, ఇలాంటి అరాచక పాలనకు ప్రజలు ఓటు అనే బుల్లెట్‌తో సమాధానం చెబుతారని అన్నారు. డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య మాట్లాడుతూ.. అధికార పార్టీలో కొనసాగుతున్న పొంగులేటిపై ప్రభుత్వమే కక్షసాధింపు చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో మార్పుకోసం పొంగులేటి తీసుకోబోయే నిర్ణయానికి అందరూ కట్టుబడి పనిచేయాలని కోరారు. సమావేశంలో అశ్వారావుపేట నియోజకవర్గ నాయకుడు జారే ఆదినారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఎండీ షరీఫుద్దీన్, మణుగూరు వైస్ ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, గుండాల మాజీ ఎంపీపీ చాట్ల పద్మ, నాయకులు ఎస్‌కే ఖదీర్, ఎర్ర సురేష్, కమటం నరేష్, పేరం వెంకటేశ్వరరావు, కొమరం రాములు, నెల్లిపాక పీఏసీఎస్ చైర్మన్ తుకాని మధుసూదన్‌రెడ్డి, దారా అశోక్, వాసం శ్రీకాంత్, పాయం సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే ఇదేనా..?

జిల్లాలోని మారుమూల ఏజెన్సీ ప్రాంత పల్లెల్లో ఇంటికి పైకప్పు లేని కుటుంబాలు 50 శాతానికి పైగా ఉన్నాయని పొంగులేటి వ్యాఖ్యానించారు. ఎన్నో ఏళ్లుగా రగులుతున్న పోడు సమస్యను కూడా ఇంతవరకూ పరిష్కరించలేదన్నారు. అభివృద్ధి అంటే మీ పక్కన డప్పు కొట్టే వాళ్లు చెప్పేది కాదని, మారుమూల గ్రామాల్లో ప్రజలను అడిగితే నిజం తెలుస్తుందని చెప్పారు. గ్రామ పంచాయతీ మొదలు, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ఎలా పని చేశామో జిల్లా ప్రజలకు తెలుసని అన్నారు.

అదే స్వరం.. అదే ఆవేదన

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన ఆవేదన వెలిబుచ్చే క్రమంలో స్వరం మరింత పెంచారు. ఈనెల 1న పార్టీపై సుతిమెత్తగా వ్యాఖ్యలు చేయగా.. తోగ్గూడెంలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఏకంగా పార్టీ పెద్దలపై విమర్శలు ఎక్కుపెట్టారు. గత నాలుగున్నరేళ్లలో తన రాజకీయ ప్రస్థానాన్ని నెమరువేసుకున్నారు. పొంగులేటి ఏ కార్యక్రమం చేసినా ఫ్లెక్సీల్లో ఒకవైపు సీఎం కేసీఆర్, మరోవైపు మంత్రి కేటీఆర్ ఫొటోలు ఉండేవి. అయితే మంగళవారం నాటి ఆత్మీయ సమ్మేళనం ఫ్లెక్సీలో వీరి ఫొటోలు లేకపోవడం గమనార్హం.

ప్రజాక్షేత్రంలోనే ఉంటా..

ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై నమ్మకంతో తాను తన అనుచరులతో కలిసి పార్టీలో చేరానని పొంగులేటి ఆత్మీయ సమ్మేళనంలో గుర్తు చేసుకున్నారు. అయితే రాజకీయంగా అనేక అవమానాలు ఎదుర్కొన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తే నియోజకవర్గంలో ఏం పని అంటూ తనపై కామెంట్లు చేశారని, ఇకపై ఇలాంటివేమీ పట్టించుకోకుండా ప్రజాక్షేత్రంలో ఉంటానని మనుసులోని మాటను స్పష్టం చేశారు. అంతేకాకుండా పార్టీ అగ్రనేతలు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులపై ఘాటుగా పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

పది రోజుల్లోనే తారాస్థాయికి..

పొంగులేటి వ్యాఖ్యల స్వరం రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా 'బీఆర్‌ఎస్‌లో గత నాలుగున్నర ఏళ్లల్లో తనకు జరిగిందేమిటి, భవిష్యత్‌లో జరగాల్సిందేమిటో మీకు తెలియనిది కాదు' అని కేడర్‌ను ఉద్దేశించి అన్నారు. ఆతర్వాత పది రోజుల్లోనే ఆయన స్వరం మరింత పెరగడం గమనార్హం. బీఆర్‌ఎస్ తొలి సభను ఖమ్మంలో నిర్వహణకు నిర్ణయించగా.. సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో భేటీ అయ్యా రు. ఈ సందర్భంగా పొంగులేటి విషయం ప్రస్తావనకు వచ్చిందని, సీఎం కూడా ఆయనకు ప్రాధాన్యత ఇవ్వనట్లుగా మాట్లాడారనే ప్రచారం జరిగింది.

పండుగ తర్వాత మిగిలిన భేటీలు

పినపాక నియోజవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం తోగ్గూడెంలో నిర్వహించగా, నియోజకవర్గవ్యాప్తంగా పొంగులేటి అనుచర నేతలు హాజరయ్యారు. ఇక ఉమ్మడి జిల్లాలోని మిగిలిన తొమ్మిది నియోజకవర్గాల ఆత్మీయ సమ్మేళనాలు సంక్రాంతి తర్వాత నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ముందుగా అశ్వారావుపేట, ఆ తర్వాత భద్రాచలం, సత్తుపల్లితో పాటు మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో వరుస భేటీలు ఉంటాయని తెలిసింది.

క్లీన్ స్వీప్ చేస్తాం

- రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ వెన్నంటే జిల్లా ప్రజలు
- రాజకీయాల్లో అసమ్మతి సహజం
- కష్టపడితే తప్పకుండా గుర్తింపు ఉంటుంది
- విప్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయాన్ని రేపు సీఎం కేసీఆర్ ప్రారంభించనున్న సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితి, చేపట్టాల్సిన అభివృద్ధి వంటి అంశాలపై 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

పదికి పది మావే

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పదికి పది అసెంబ్లీ స్థానాలను వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుచుకోనుంది. క్లీన్‌స్వీప్ గ్యారెంటీ. 2014, 2018 ఎన్నికల సమయంలో రాష్ట్రమంతటా టీఆర్‌ఎస్ పార్టీకి బ్రహ్మరథం పడితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఫలితాలు మరో రకంగా వచ్చాయి. అయితే ఈ తొమ్మిదేళ్లలో తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో మరెక్కడా లేవు. దేశానికే తెలంగాణ రోల్‌మోడల్‌గా మారింది. తెలంగాణ పథకాలు మాకూ కావాలంటూ ఇతర రాష్ట్రాల వారు డిమాండ్ చేసే పరిస్థితి వచ్చింది. మరోవైపు ఈ జిల్లాలో పార్టీకి ఆదరణ దక్కకపోయినా ప్రభుత్వ పరంగా కేసీఆర్ ఎలాంటి వివక్ష చూపలేదు. రెండు మెడికల్ కాలేజీలు, సీతారామ ప్రాజెక్టు, బీటీపీఎస్ వంటివి అనేకం మంజూరు చేశారు. దీంతో ఈ సారి కేసీఆర్ వెన్నంటి నడిచేందుకు జిల్లా ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

అసమ్మతి సహజం

రాజకీయ పార్టీల్లో అసమ్మతి సహజం. జిల్లాలో పార్టీలో అనేక మంది నాయకులు ఉన్నారు. చాలా పోటీ నెలకొంది. దీంతో అసమ్మతి కూడా ఉంటుంది. అయితే పార్టీ కోసం పని చేసే వారిని కేసీఆర్ కచ్చితంగా గుర్తిస్తారు. వారి కృషికి తగ్గ గౌరవం అందిస్తారు. అప్పటి వరకు వేచి ఉండాలి. అలా కాకుండా పార్టీ లైన్ దాటి అసమ్మతి వినిపిస్తే మా నేత సరైన సమయం చూసుకుని నిర్ణయం తీసుకుంటారు. ఆ నిర్ణయానికి మేమంతా కట్టుబడి ఉంటాం. మా పార్టీనే తీసుకుంటే కోరం కనకయ్యకు బీఫాం ఇచ్చాం, ఎన్నికల ఖర్చు పార్టీనే ఇచ్చింది. ఆ ఎన్నికల్లో ఓడిపోతే వెంటనే జిల్లా పరిషత్ చైర్మన్‌ను చేసి గౌరవించింది. ఇంకా కావాలంటే ఎలా? ఈ తరహా అసమ్మతిని పట్టించుకోవాల్సిన అవసరం కూడా లేదు. ఇక వివిధ పార్టీల నుంచి మా పార్టీలోకి వచ్చిన వారు ఉన్నారు. వారు నిత్యం అనేక మందితో టచ్‌లో ఉంటుంటారు. అదే స్థాయిలో కన్‌ఫ్యూజ్ అవుతుంటారు. వారికి తప్ప మిగిలిన వాళ్లకు పార్టీలో ఎలాంటి ఇబ్బందులు లేవు.

గర్వంగా ఉంది

తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో కేసీఆర్‌తో కలిసి నడిచే అవకాశం దక్కలేదనే బాధ ఉండేది. కానీ ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో రాజ్యాంగం ప్రకారం టీఆర్‌ఎస్ పార్టీలో విలీనం అయ్యాను. కేసీఆర్‌తో కలిసి పని చేసే భాగ్యం కలిగింది. కేసీఆర్ వంటి పాలనాదక్షత ఉన్న నాయకుడు చాలా అరుదు. పేదలు, ఆదివాసీల పట్ల ఆయన అంకిత భావం అపారం. ఈ రోజు బీఆర్‌ఎస్ ఫౌండర్లలో నేను ఒకడిని అయినందుకు గర్వంగా ఉంది. నేను జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే పార్టీ కార్యాలయం అందుబాటులోకి రావడం సంతోషం. ఎన్నికలకు ఇంకో 8 నెలల సమయం ఉంది. ఈలోగా పోడు భూముల సమస్యకు పరిష్కారం, సీతారామా ప్రాజెక్టు పూర్తి చేయడం, గోదావరిపై అతి పెద్ద కరకట్ట నిర్మాణం, స్పాంజ్ ఐరన్ పునరుద్ధరణ వంటి కీలక పనులు పూర్తి చేయడంపై ఫోకస్ చేశాం. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పనుల్లోనూ స్పీడ్ పెంచుతాం.

అపార అవకాశాలు

జిల్లాకు టూరిజంలో అపారమైన అవకాశాలు ఉన్నాయి. యాదాద్రి – భద్రకాళి – భద్రాద్రి టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తే పర్యాటకంలో జిల్లాకు తిరుగుండదు. సీతమ్మ సాగర్ పూర్తయితే గోదావరిలో యాభై కిలోమీటర్ల మేర నీరు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుంది. మత్స్య సంపదకు జిల్లా కేరాఫ్‌గా మారుతుంది.

కోరం కనకయ్యకు బుజ్జగింపులు!

మానుకోటలో మంత్రి సత్యవతి, ఎంపీ కవిత మంతనాలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లా పరిషత్ చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి అనుచరుడు కోరం కనకయ్యను బీఆర్‌ఎస్ నేతలు బుజ్జగిస్తున్నట్లు సమాచారం. మహబూబాబాద్‌లో మంగళవారం మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత ఆయనతో చర్చించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు పార్టీ కల్పించిన అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ మారొద్దని సూచించినట్లు సమాచారం. 2014లో ఇల్లెందు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా కోరం కనకయ్య విజయం సాధించగా.. తర్వాత కొంత కాలానికి బీఆర్‌ఎస్‌లో చేరారు. 2018లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసినా కాంగ్రెస్ అభ్యర్థి హరిప్రియ చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఆమె కూడా బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం చోటు చేసుకున్న పరిణామాల్లో ఆయన టేకులపల్లి జెడ్పీటీసీగా గెలవగా, జిల్లా పరిషత్ చైర్మన్ పదవి దక్కింది. కొంతకాలంగా ఆయన రాజకీయంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట నడుస్తున్నారు. ఈక్రమంలో ఆయనను బుజ్జగించే పనిని మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవితకు పార్టీ నాయకత్వం అప్పగించడంతో మహబూబాబాద్ పిలిపించి మాట్లాడినట్లు తెలుస్తోంది.

సర్వం సిద్ధంగా ఉండాలి

టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈనెల 12న సీఎం కేసీఆర్ నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సర్వం సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. మంగళవారం అన్ని శాఖల జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రారంభోత్సవం అనంతరం అన్ని శాఖల జిల్లా అధికారులతో సీఎం సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం సమీకృత జిల్లా అధికారుల సముదాయంలో ఏర్పాటు చేసిన సభావేదిక నుంచి మాట్లాడుతారని చెప్పారు. స్టేజీ, షామియానా, సీటింగ్ ఏర్పాట్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్, ప్రకాశంస్టేడియంలో ఏర్పాటు చేసే రెండు హెలీప్యాడ్‌లను పర్యవేక్షించాలని ఆర్‌అండ్‌బీ ఈఈకి సూచించారు. సీఎం పర్యటించే ప్రాంతంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పకడ్బందీగా రూట్ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పార్కింగ్ స్థలాలను గుర్తించేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని రవాణా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీపీఓ రమాకాంత్, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, ఆర్డీఓ స్వర్ణలత, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, పీఆర్ ఈఈ సుధాకర్ పాల్గొన్నారు.

చకచకా పనులు

- ప్రారంభోత్సవానికి సిద్ధమైన నూతన కలెక్టరేట్
- బిజీ బిజీగా అధికార యంత్రాంగం
- సిబ్బందితో కలెక్టర్, ఎస్పీ వేర్వేరుగా సమావేశాలు
- పనులు పరిశీలించిన విప్ రేగా, ఎమ్మెల్యే వనమా



పనుల నిర్వహణపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనతో అధికారులు అప్రమత్తమయ్యారు. నూతన కలెక్టరేట్‌ను గురువారం ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. దీంతో కలెక్టర్ కార్యాలయంలో మిగిలి ఉన్న చిన్న చిన్న పనులనుల వేగవంతం చేశారు. కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్ తమ తమ సిబ్బందితో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి, చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సీఎం జిల్లా పర్యటన ఈనెల 8వ తేదీ సాయంత్రమే ఖరారు కావడంతో అధికారులు కంటి మీద కునుకు లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయంలో లిఫ్టులు సక్రమంగా పని చేస్తున్నాయా అని ఒకటికి రెండుసార్లు చెక్ చేశారు. ప్రతి శాఖకు సంబంధించిన కార్యాలయానికి నేమ్ బోర్డులు, ఫర్నిచర్ ఏర్పాటు చేసి అందంగా ముస్తాబు చేస్తున్నారు. కలెక్టరేట్ ప్రాంగణమంతా క్లీన్ అండ్ గ్రీనరీ ఉట్టిపడేలా పనులు ముమ్మరం చేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలోనే హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పనులను పర్యవేక్షించారు. నూతన కలెక్టరేట్‌లో పాటు జిల్లా కేంద్రంలో నిర్మించిన బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయాన్ని కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. నూతన కలెక్టరేట్ నుంచి కొత్తగూడెంలోని బీఆర్‌ఎస్ కార్యాలయం వరకు పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులంతా ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. అంతేకాక తమకు అప్పగించిన పనులను పటిష్టంగా అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించుకుంటున్నారు.



మాట్లాడుతున్న విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యే వనమా పక్కన కలెక్టర్, ఎస్పీ

కదలని కార్యాలయాలు..

వివిధ ప్రభుత్వ శాఖలు తమకు సంబంధించిన కార్యకలాపాలను ప్రారంభోత్సవం రోజు నుంచే నూతన కలెక్టరేట్‌లో నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ గతంలో అనేక సమావేశాల్లో స్పష్టం చేశారు. అయితే అధికారుల అలసత్వమో లేక పని ఒత్తిడో తెలియదు కానీ.. మంగళవారం వరకు ఏ ప్రభుత్వ శాఖా తమ కార్యాలయానికి సంబంధించిన ఫైళ్లు, ఇతర సామగ్రిని నూతన కలెక్టరేట్‌లోకి తరలించలేదు.

ఇరువైపులా షాపుల బంద్..

నూతన కలెక్టరేట్ నుంచి బీఆర్‌ఎస్ కార్యాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను మూసివేయాలని ఇప్పటికే అధికారులు వ్యాపార వర్గాలకు సమాచారం ఇచ్చారు. ఈనెల 12న మధ్యాహ్నం నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించిన తర్వాత సీఎం కేసీఆర్.. రోడ్డు మార్గాన బీఆర్‌ఎస్ కార్యాలయానికి చేరుకునే అవకాశం ఉంది. దీంతో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా ముందస్తుగా షాపులను బంద్ చేయాలని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రకటించారు. ముఖ్యమంత్రి పర్యటన కోసం అన్ని శాఖల అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు.

అధికారులతో ప్రజాప్రతినిధుల చర్చలు..

ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, ఇతర అంశాలపై ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కలెక్టర్ అనుదీప్, ఎస్పీ డాక్టర్ వినీత్‌తో మంగళవారం నూతన కలెక్టరేట్‌లో చర్చించారు. కాగా, నూతన కలెక్టరేట్ సముదాయాన్ని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య కూడా పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ విద్యాలత, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, పాల్వంచ తహసీల్దార్ రంగప్రసాద్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సంజీవరావు, ఆర్‌అండ్‌బీ సీఈ తిరుమలరెడ్డి, ఈఈ భీమ్లా, దుమ్ముగూడెం, దమ్మపేట, పాల్వంచ, ఆళ్లపల్లి జెడ్పీటీసీలు సీతక్క, పైడి వెంకటేశ్వరరావు, బరపటి వాసుదేవరావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ పెరగాలి

జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

చుంచుపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సూచించారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండొద్దని చెప్పారు. సమీక్ష సమావేశాల సందర్భంగా చర్చించిన అంశాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా ప్రజాసమస్యల విషయంలో అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మన ఊరు – మన బడి పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని, దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతాయని చెప్పారు. వ్యాధుల నియంత్రణకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యాధికారులను ఇటీవల ప్రభుత్వం నియమించిందని, వారితో మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని చెప్పారు. ఆస్పత్రుల్లో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే కలెక్టర్‌తో చర్చిస్తానని చెప్పారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టే స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వం నిరుద్యోగులకు అనేక అవకాశాలు కల్పిస్తోందని, గ్రామీణ యువతకు వాటిపై అవగాహన కల్పించాలని చెప్పారు. కాగా, ఇటీవల వరదలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు మంజూరైన నిధులను ప్రభావిత ప్రాంతాల్లో కాకుండా ఇతరే చోట్ల ఎక్కువగా కేటాయించడం పట్ల పలువురు జెడ్పీటీసీలు అభ్యంతరం తెలిపారు. దీనిపై స్పందించిన జెడ్పీ చైర్మన్.. వరద ముంపు ప్రాంతాల్లోని రహదారులకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. ఎక్కడ పనులు అవసరమో ముందుగా గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయకుంటే నష్టం జరుగుతుందని అన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి జిల్లా సమగ్రాభివృద్ధికి దోహదపడాలని కోరారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, సీఈఓ విద్యాలత, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు, వ్యవసాయ శాఖ అధికారి అభిమన్యుడు, ఏపీడీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

క్లుప్తంగా

త్వరలో డయాలసిస్ సేవలు



వైద్యులతో చర్చిస్తున్న డాక్టర్ రవిబాబు

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో త్వరలోనే డయాలసిస్ సేవలు ప్రారంభిస్తామని డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు జరుగుతున్న పనులను పరిశీలించారు. రోగులకు అనుకూలంగా ఉండేలా గదులను కేటాయించి డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు పనులు వేగవంతం చేయాలని వైద్యులకు సూచించారు. పనులు పూర్తయితే సేవలను వెంటనే అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు.

'కంటి వెలుగు'పై వైద్యాధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శిరీష

చుంచుపల్లి: ఈ నెల 18 నుంచి జిల్లాలో చేపట్టనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి హాజరైన డీఎంహెచ్ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యాధికారులు ప్రణాళికా ప్రకారం ఆయా గ్రామాల్లో క్యాంపులను నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. క్యాంపులకు వచ్చే ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రవికుమార్, డాక్టర్ పర్షియానాయక్, డిప్యూటీ డెమో ఫయాజ్ మొహియుద్దీన్, డీపీఓ దుర్గ, విజయ్‌కుమార్, రాంప్రసాద్, భద్రు తదితరులు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం

ములకలపల్లి: పంట భూమిలో నివాసం కోసం ఏర్పాటు చేసుకున్న పూరి గుడిసె ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతైంది. బాధితుడు ముకేశ్ కథనం ప్రకారం.. పాతగుండాలపాడు గ్రామ పంచాయతీలోని చలమన్ననగర్‌కు చెందిన మడివి ముకేశ్ గ్రామ శివారులోని పంటచేలో పూరిగుడిసె నిర్మించుకొని జీవిస్తున్నాడు. మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో గుడిసెకు నిప్పు అంటుకోవడంతో పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో 10 క్వింటాళ్ల పత్తి, దుక్కిదున్నే యంత్రం, క్వింటా బియ్యం, 50 కేజీల మొక్కజొన్నలు, వంట సామగ్రి, బట్టలు కాలిపోయాయని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధిత రైతు అభ్యర్థిస్తున్నాడు.


డివైడర్‌ను ఢీకొట్టిన బస్సు

చుంచుపల్లి: హైదరాబాద్ నుంచి మణుగూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మంగళవారం ఉదయం విద్యానగర్ జీవీ మాల్ వద్ద అడ్డుగా వచ్చిన కుక్కలను తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. వారిని ఆర్టీసీ సిబ్బంది స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

ఆటో చోరీపై కేసు

భద్రాచలంఅర్బన్: పార్క్ చేసిన ఆటోను గుర్తుతెలియని దుండగులు అపహరించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని ఏఎంసీ కాలనీకి చెందిన కారం రమేశ్ స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఆరు గంటలకు ఆటోలో వచ్చి, పార్కింగ్‌లో ఆటోను నిలిపి విధుల్లో చేరాడు. తిరిగి వచ్చి చూసేసరికి పార్కింగ్‌లో ఆటో లేదు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ మధుప్రసాద్ కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు మృతి



తారాసింగ్ (ఫైల్)

టేకులపల్లి: మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, యూటీఎఫ్ సీనియర్ కార్యకర్త మంగళవారం మృతి చెందారు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తొమ్మిదోమైలుతండా గ్రామానికి చెందిన లాకావత్ తారాసింగ్ (45) మండలంలోని చింతలంక ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కొంతకాలంగా మెదడులో సమస్య కారణంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో మెదడులో రక్తం గడ్డకట్టి పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి హైదరాబాద్ ఆస్పత్రిలోనే మృతి చెందారు. మృతుడి భార్య కూడా ప్రభుత్వ ఉపాధ్యాయురాలే. యూటీఎఫ్, ఇతర సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,881

సీఎం రాక కోసం..



జీసీఎం రహదారిని శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



హెలీప్యాడ్‌ను సిద్ధం చేస్తున్న సిబ్బంది

పాల్వంచ: నూతన జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ప్రారంభోత్సవానికి ఈ నెల 12వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన నేపథ్యంలో మున్సిపాలిటీలో పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేశారు. భారీ ఎత్తున ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, పార్టీ శ్రేణులు వచ్చే అవకాశం ఉండటంతో కలెక్టరేట్ చుట్టు పక్కల ఉన్న స్థలాలన్నింటినీ శుభ్రం చేశారు. ఆక్రమణలో ఉన్న బడ్డీ కొట్టు, చిన్న చిన్న నిర్మాణాలన్నింటిని తొలగించి డోజర్‌తో శుభ్రం చేసి మైదానాలుగా తీర్చిదిద్దారు. పార్కింగ్ కోసం చుట్టూ ఉన్న ప్రదేశాలను శుభ్రం చేశారు. మున్సిపాలిటీ సిబ్బంది కలెక్టరేట్ ఏరియా మొత్తంలో చిన్న చిన్న తుప్పలు, చెత్తా చెదారం తొలగిస్తున్నారు. బీసీఎం రహదారి పొడవునా శుభ్రం చేస్తున్నారు. డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను అందంగా తీర్చిదిద్దుతున్నారు. నీటిని పెడుతున్నారు. గ్రామ పంచాయతీల నుంచి సైతం వాటర్ ట్యాంక్‌లను తెప్పించి మైదానాలను, చెట్లను తడుపుతున్నారు. ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు భారీ ఎత్తున బారీ కేడ్లు తెప్పించి ఏర్పాటు చేస్తున్నారు.

హెలీప్యాడ్ సిద్ధం..

కలెక్టరేట్ పక్కనే హెలీప్యాడ్ కోసం ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేశారు. సీఎం కేసీఆర్ హెలీక్యాప్టర్ దిగి వచ్చే రోడ్డు మొత్తం ఆకట్టుకునేలా పనులు చేస్తున్నారు.

జీఓ నంబర్ 45కు వ్యతిరేకం కాదు..

ఎమ్మెల్యే పొదెం వీరయ్య



మాట్లాడుతున్న పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణాన్ని మూడు పంచాయతీలుగా విభజించి జీఓ నంబర్ 45 ప్రకా రం ఎన్నికలు నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయానికి తాను వ్యతిరేకం కాదని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య స్పష్టం చేశారు. మూడు పంచాయతీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ.. భద్రాచలం ఐటీడీఏ ఎదుట గిరిజన సంఘాల అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ఎమ్మెల్యే పొదెం వీరయ్య సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. అనంతరం హైకోర్టు తీర్పునకు అనుగుణంగా భద్రాచలంలో ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రుకు వినతిపత్రం అందజేశా రు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ సొందె వీరయ్య , కుంజా ధర్మ, చిచ్చడి శ్రీరామ్మూర్తి, వాసం హరికృష్ణ, పాయం సత్యనారాయణ, దేవదానం, నర్సింహా రావు, పూనెం కృష్ణ, సుభద్ర, వెంకన్న, రత్తమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

డివిజన్లు, అనుబంధ సంఘాలకూ కమిటీలు



వివరాలను వెల్లడిస్తున్న నాయకులు

కొత్తగూడెంరూరల్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం బాధ్యులు వివరాలను వెల్లడించా రు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా రెడ్డిమళ్ల వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు, కోశాధికారిగా పితాని సత్యనారాయణను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఇక జిల్లా ప్రధాన కార్యదర్శిగా కురిమెళ్ల శంకర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కొల్లు పద్మ, మరియ, విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొమరవెల్లి రవీందర్, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కేశగాని శంకర్‌రావు, గౌరవ సలహాదారులుగా బాలసాని లక్ష్మీనారాయణ, మచ్చా శ్రీనివాసరావు, బరపటి వాసుదేవరావు, కొత్వాల శ్రీనివాసరావు, మల్లెల రామనాథం, లక్కినేని సురేందర్, మండె వీరహనుమంతరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రాఘవులు, అంకిత మల్లికార్జున్‌రావు, ఇంద్రాల మురళి, యర్రంశెట్టి ముత్తయ్య, మడత వెంకట్‌గౌడ్, కార్యదర్శులుగా నరాటి ప్రసాద్, సత్యనారాయణసింగ్, పానుగంటి రాంబాబు, భారత్ రాంబాబు, చిర్రం వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా చుక్కా సురేశ్‌ను ఎన్నుకున్నారు. ఇంకా భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లెందు, కొత్తగూడెం, పినపాక డివిజన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తుమ్మలపల్లి ధనేశ్వరరావు, కళ్లెం ప్రేమ్‌కుమార్, లింగాశెట్టి వెంకటేశ్వరరావు, కడియం హుస్సేన్, ఇంద్రాల మురళి, సైదుబాబు, బొడ్డుపల్లి చంద్రమౌళి, టి.సతీశ్‌తో పాటు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు. సమావేశంలో నాయకులు మారబోయిన పద్మ, సింగరాపు రేణుక, బండారు విజయలక్ష్మి, మంచినీళ్ల చిట్టమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

గుడారాల తొలగింపులో ఉద్రిక్తత

- ఫారెస్ట్, వరద బాధితుల మధ్య వాగ్వాదం
- తోపులాటలో సొమ్మసిల్లిన మహిళలు



గుడారాలను తొలగిస్తున్న అటవీశాఖ సిబ్బంది



సొమ్మసిల్లి పడిపోయిన భద్రమ్మ

బూర్గంపాడు: మణుగూరు క్రాస్‌రోడ్ సమీపంలో ఇళ్లస్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించాలనే డిమాండ్‌తో గోదావరి వరద బాధితులు చేపట్టిన దీక్షా శిబిరం వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. వరద బాధితులు వేసుకున్న 200 గుడారాలను తొలగించేందుకు అటవీశాఖ సిబ్బంది సోమవారం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో అటవీశాఖ సిబ్బందికి, వరద బాధితులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వరద బాధితులు అటవీప్రాంతంలో ఏర్పాటు చేసిన గుడారాలను అటవీశాఖ అధికారులు తొలగించే క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. గుడారాలలోని మహిళలను బయటకు తీసుకువచ్చే క్రమంలో అటవీశాఖ సిబ్బంది తమపై దాడులకు పాల్పడ్డారని బాధితులు వాపోయారు. ఈ క్రమంలో కొందరు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 150 రోజులుగా మైదాన ప్రాంతాలలో ఇళ్లు నిర్మించాలని శాంతియుతంగా నిరాహార దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని బాధితులు ఆరోపించారు. గోదావరి వరదల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని శాంతియుతంగా కోరుతుంటే అటవీఅధికారులు దాడులు చేయటం దారుణమని వారు వాపోయారు. అటవీశాఖ అధికారులు తమను ఎన్ని ఇబ్బందులు పెట్టినా దీక్షలను మాత్రం ఆపేదిలేదని స్పష్టం చేశారు. వరద బాధితులకు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు మద్దతుగా నిలిచారు. ఎన్డీ నాయకులు పెద్దగోని ఆదిలక్ష్మి, ఎట్టి లక్ష్మణ్, కొండపనేని కృష్ణయ్య, ముత్యాల సత్యనారాయణ, కొమరం సుజాత, భద్రమ్మ, భూలక్ష్మి, గజ్జల అలివేలు తదితరులు వరద బాధితులకు మద్దతుగా నిలిచారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

పాల్వంచరూరల్: పాత కక్షల నేపథ్యంలో తండ్రీ, కుమారుడిపై దాడిచేసిన వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పెద్దమ్మగుడి వద్ద విజయదుర్గ రైస్ మిల్లు యజమాని బాదర్ల బాబ్జీ, అతని కుమారుడు బస్వయ్యపై పాత పాల్వంచకు చెందిన గుర్రాల రవికుమార్‌కు మధ్య వ్యాపార, ఆర్థిక లావాదేవిల విషయంలో తగాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీన బాబ్జీ, అతని కుమారుడితో రవికుమార్ గొడవపడి కర్రతో దాడి చేశాడు. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. బాబ్జీ ఫిర్యాదు మేరకు రవికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

సీఎం హామీలను మంత్రి అమలు చేయాలి

మాజీ ఎంపీ మిడియం బాబూరావు



మాట్లాడుతున్న మిడియం బాబూరావు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సమస్యలపై ముఖ్యమంత్రి చేసిన వాగ్దానాలను అమలు చేసే బాధ్యత జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీసుకుని, నిర్దిష్ట కాల పరిమితితో అమలుకు ప్రకటన చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ, శాఖా కార్యదర్శుల సమావేశం మర్లపాటి రేణుక అధ్యక్షతన బండారు చందర్‌రావుభవన్‌లో నిర్వహించగా వారు పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 12న ముఖ్యమంత్రి కేసీఆర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రారంభించడానికి వస్తున్నారని, ఈ సందర్భంగా గతంలో భద్రాచలం ప్రాంతానికి సీఎం కేసీఆర్ చేసిన వాగ్దానాలను అమలు జరిపే బాధ్యత జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ తీసుకోవాలన్నారు. వరదల సందర్భంగా ముఖ్యమంత్రి భద్రాచలాన్ని ముంపు నుంచి రక్షించడం కోసం నిర్వాసితులను ఆదుకోవడానికి రూ.1000 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో భద్రాచలం రామాలయం అభివద్ధి కోసం రూ.వంద కోట్లు ప్రకటించారు. పోలవరం ముంపు వలన జరుగుతున్న నష్టాన్ని ఇటీవల వచ్చిన వరదల సందర్భంగా గుర్తించామని స్వయాన మంత్రే అంగీకరించారని, కరకట్టను పటిష్టం చేసి, ముంపు బారి నుంచి ప్రజలను రక్షించడానికి ముఖ్యమంత్రి నుంచి నిర్దిష్టమైన ప్రకటన ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల 45 జీఓ ద్వారా భద్రాచలాన్ని మూడు గ్రామ పంచాయతీలుగా విభజన చేస్తూ చేసిన ప్రకటనను ప్రభుత్వం విరమించుకోవాలని, పిసా చట్టాన్ని అమలు చేయాలని, భద్రాచలాన్ని ఒకే పంచాయతీగా ఉంచి తక్షణమే ఎన్నికలు జరపాలని వారు కోరారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, నాయకులు సున్నం గంగ, బి.వెంకటరెడ్డి, బండారు శరత్‌బాబు, సంతోష్, నాగరాజు, జీవనజ్యోతి, చేగొండి శ్రీను, మాధవరావు, డీవైఎఫ్ఎస్ఐ పట్టణ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, భూపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణంపై త్వరలో అనుమతులు

డీఎఫ్ఓ లక్ష్మణ్‌రంజిత్‌నాయక్



రహదారి మ్యాప్ పరిశీలిస్తున్న డీఎఫ్ఓ



నర్సరీని పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ అప్పయ్య

ఇల్లెందురూరల్: ఏజెన్సీలో అటవీశాఖ అభ్యంతరంతో ఆగిపోయిన రహదారుల నిర్మాణానికి నెల రోజుల వ్యవధిలో అనుమతులు వస్తాయని డీఎఫ్ఓ లక్ష్మణ్‌రంజిత్‌నాయక్ తెలిపారు. మండలంలోని తుంటుబాలుతండా–పోచారం, పూబెల్లి–దండగుండాల, ఆర్అండ్‌బీరోడ్డు–ధర్మాపురం రహదారులను మంగళవారం ఆయన పరిశీలించారు. పంచాయతీరాజ్‌శాఖ, అటవీశాఖ సంయుక్తంగా క్షేత్రస్థాయిలో చేసిన సర్వే నివేదికలను పరిశీలించారు. అటవీశాఖకు చెల్లించాల్సిన పరిహారం వివరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలతో ఆయన ముచ్చటించారు. మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడంలో అటవీశాఖ అధికారులు అడ్డుపడలేదని, చట్టం, నిబంధనలు మాత్రమే అడ్డుగోడగా నిలిచాయని గుర్తుచేశారు. చట్టపరిధిలో సక్రమ మార్గంలో అనుమతులు పొందడంలో కొంత జాప్యం జరిగిందని, నెల రోజుల వ్యవధిలో రహదారి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అనుమతులు మంజూరవుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బోయితండా సర్పంచ్ బానోత్ సంతు, ఎఫ్‌డీఓ నీరజ్‌కుమార్, ఎఫ్ఆర్ఓ రవీందర్, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ, అభివృద్ధే లక్ష్యం

– కొత్తగూడెం ఎఫ్‌డీఓ అప్పయ్య

జూలూరుపాడు: అడవుల సంరక్షణ, అభివృద్ధే తమ ధ్యేయమని కొత్తగూడెం ఎఫ్‌డీఓ అప్పయ్య పేర్కొన్నారు. మంగళవారం జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని వినోభానగర్, జూలూరుపాడు అటవీ నర్సరీలు, వినోభానగర్, రాజారావుపేట ప్లాంటేషన్‌లను ఆయన పరిశీలించారు. అటవీ శాఖకు కేటాయించిన జూలూరుపాడు రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 250లోని 60 ఎకరాలను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎఫ్ఆర్ఓ కార్యాలయంలో అటవీ సిబ్బందితో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. అటవీ రక్షణ విషయంలో అలసత్వం తగదని, అటవీ ప్లాంటేషన్, నర్సరీల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లే సమయంలో ఉద్యోగులు తగు జాగ్రత్తలు పాటించాలని, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను అధిగమించే క్రమంలో మనోధైర్యం కోల్పోవద్దని సూచించారు.

కార్యక్రమంలో జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు, డీఆర్ఓలు ధనలక్ష్మి, లక్ష్మీనర్సు, సెక్షన్ ఆఫీసర్లు మల్లయ్య, సలీం, బీట్ ఆఫీసర్లు రేఖ, కిషన్, నర్సింహారావు, రవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు అంతర్ జిల్లాల దొంగలు అరెస్ట్

రూ.16 లక్షల సొత్తు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న ఖమ్మం సీపీ వారియర్

ఖమ్మంక్రైం: పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు రెండు కేసుల్లో ముగ్గురిని అరెస్టు చేయగా, వారి నుంచి రూ.16 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో సీపీ విష్ణు ఎస్.వారియర్ మంగళవారం వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని న్యూగొల్లగూడెంనకు చెందిన వరికుప్పల వెంకటేశ్, లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండరామవరానికి చెందిన నారసాని రమేశ్ కలిసి ముదిగొండ మండలం వల్లభిలోని బంగారం షాప్‌లో రూ.10 లక్షల విలువైన ఆభరణాలు చోరీ చేశారు. మొదట రెక్కీ చేశాక వీరు చోరీకి పాల్పడగా, మంగళవారం వీవీపాలెం వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. వారి నుంచి 23 గ్రాముల బంగారం, 12 కేజీల వెండి స్వాధీనం చేసుకున్నారు. ఇక ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. సదరు వ్యక్తి రంగారెడ్డి జిల్లా చింతల్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన మనిగండ్ల విజయ్‌కుమార్‌గా తేలింది. ఆయన ఖానాపురంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడడమే కాక, గతంలో జీడిమెట్ల, బాలానగర్, సత్తుపల్లి, కొత్తగూడెం, జడ్చర్ల, భువనగిరి జిల్లాల్లోనూ దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. విజయ్ నుంచి 97 గ్రాముల బంగారం , 724 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నారు. వారు ముగ్గురు కూడా జల్సాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్నట్లు తేలిందని సీపీ వారియర్ వివరించారు.

రోడ్డును కమ్మేసిన బూడిద



పైపులైన్ లీకై బయటకు వచ్చిన బూడిద

పాల్వంచరూరల్: పాల్వంచ నుంచి పాండురంగాపురం వైపు వెళ్లే మార్గంలోని రహదారిపై బూడిద కమ్మేయడంతో రాకపోకలు కొద్దిసేపు స్తంభించాయి. పాండురంగాపురం నుంచి పాల్వంచ వైపు వచ్చే ప్రధాన రహదారి పక్కన గల కేటీపీఎస్ 5వ దశలో విద్యుత్ ఉత్పత్తికోసం బొగ్గును మండిస్తారు. పైపులైన్‌ద్వారా సైలోకు బూడిదను తరలిస్తారు. అక్కడ వాహనాల్లో బూడిదను లోడుచేసే సైలోకు చెందిన రెండు పైపులైన్‌లు ఉన్నాయి. ఈ రెండు పైప్‌లైన్‌లను కలిపే చోట లీక్ కావడంతో బూడిద మొత్తం పైపులో నుంచి బయటకు వచ్చింది. దీంతో రాకపోకలు కొద్దిసేపు నిలిచిపోయాయి. అప్రమత్తమైన అయిన కేటీపీఎస్ అధికారులు వెంటనే బూడిద లీకేజీని అడ్డుకున్నారు. బూడిద లీక్ కాకుండా మరమ్మతులు చేపడుతామని సీఈ ప్రభాకర్‌రావు తెలిపారు.

లారీ కింద పడి వ్యక్తి మృతి



చందర్‌రావు మృతదేహం

కొత్తగూడెంటౌన్: లారీ కిందపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కొత్తగూడెం పట్టణంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. లక్ష్మీదేవిపల్లి మండలం పాత బస్‌డిపో ప్రాంతమైన సాయినగర్‌కు చెందిన గొల్ల చందర్‌రావు (50) కొత్తగూడెంలో ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ద్విచక్రవాహనంపై బయటకు వచ్చి ఇంటికి వెళ్తున్న క్రమంలో పోస్టాఫీస్ సెంటర్ అంబేడ్కర్ సర్కిల్ వద్దకు చేరుకోగానే శేషగిరినగర్ నుంచి చుంచుపల్లికి వెళ్తున్న లారీ కింద పడ్డాడు. గమనించిన లారీడ్రైవర్ లారీని నిలిపివేయడంతో వెనుక టైర్లు శరీరంపైకి ఎక్కి ఆగిపోయాయి. దీంతో చందర్‌రావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం అయింది. వన్‌టౌన్ ఎస్ఐ షాహినా ఘటనా స్థలానికి చేరుకుని వివరాలా ఆరాతీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీటెక్ విద్యార్థిని అదృశ్యం

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం పోస్ట్ మెట్రిక్ గరల్స్ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యంపై స్థానిక పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ పోటు గణేశ్ కథనం మేరకు.. చండ్రుగొండ మండలం అన్నారంతండాకు చెందిన ఓ విద్యార్థిని బీటెక్ చదువుతూ పడమటనర్సాపురం పోస్ట్ మెట్రిక్ గరల్స్ హాస్టల్‌లో ఉంటోంది. ఈ నెల 9వ తేదీన సంక్రాంతి పండుగ సెలవుల సందర్భంగా ఇంటికి వెళ్తున్నానని హాస్టల్ వార్డెన్‌కు విద్యార్థిని లీవ్ లెటర్ రాసి వెళ్లిపోయింది. మంగళవారం విద్యార్థిని తల్లిదండ్రులు హాస్టల్‌లో ఉంటున్న ఆమె స్నేహితురాలికి ఫోన్ చేయగా సోమవారమే ఆమె లీవ్‌లెటర్ ఇచ్చి ఇంటికి వెళ్లిపోయిందని చెప్పింది. ఈ విషయాన్ని విద్యార్థిని స్నేహితురాలు హాస్టల్ వార్డెన్‌కు తెలియపరిచడంతో చండ్రుగొండ గరల్స్ హాస్టల్‌లో వార్డెన్‌గా విధులు నిర్వర్తిస్తూ పడమటనర్సాపురం హాస్టల్ ఇన్‌చార్జ్ వార్డెన్‌గా పనిచేస్తున్న బానోత్ కల్యాణి హుటాహుటిన హాస్టల్‌కు వచ్చింది. విద్యార్థిని గురించి ఆమె స్నేహితులు, బంధువులను ఆరాతీయగా ఆచూకీ దొరకలేదు. దీంతో వార్డెన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేశ్ పేర్కొన్నారు.